క్లుప్తంగా

టీఎస్‌టీడీసీ చైర్మన్‌కు సన్మానం



గెల్లు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర టూరిజం అబివృద్ధి పర్యాటక శాఖ చైర్మన్ (టీఎస్‌టీడీసీ)గా ఇటీవల గెల్లు శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు, ఈ మేరకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ హైద్రాబాద్‌లో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన మర్ల కృష్ణయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చల్లంపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కృష్ణయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ కృష్ణయాదవ్, ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మంజులచంద్రమౌళి, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు రాములుగౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, నాయకులు రాజేందర్, సుదర్శన్‌రెడ్డి, గౌరటి యాదయ్య యాదవ్, రాములునాయక్, నర్సింహగౌడ్, చెన్నయ్య తదితరులున్నారు.

పేదింటి నిర్మాణానికి సాయం

తలకొండపల్లి: ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకరిస్తుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో నీరడి లక్ష్మీదేవి, లకుమల్ల అజయ్ నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి నిర్మాణాలు మధ్యలో నిలిపివేదయంతో ఉపసర్పంచ్ అజీజ్ ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు ట్రస్టు నిధులతో ఇసుక, కాంక్రీట్, సిమెంట్, స్టీల్, ఇటుక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబాజి, రాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

యాచారం: దివ్యాంగుల సంక్షేమం, వారి అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషి చేయాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త దెంది రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీరాములు, జంగయ్య, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండాలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. తండాకు చెందిన వి.జిడియాసత్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, స్థానిక నాయకులు శ్రీనునాయక్, లాలునాయక్, మల్యానాయక్, రమేశ్, భీమ్లా, పాండు, హనుమాన్, గురునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

సీఐ ఉపేందర్



ఆమనగల్లు: ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే ఎస్ఐ, 21న నిర్వహించే తుది రాత పరీక్షలకు హాజరు అవుతున్న అభ్యర్థులు ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని ఆమనగల్లు సీఐ ఉపేందర్ సూచించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో శుక్రవారం సీఐ ఉపేందర్ విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రెండు నెలల పాటు పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణిచ్చామన్నారు. అప్పట్లో శిక్షణ పొందిన వారిలో దాదాపు 70మంది ప్రాథమిక పరీక్ష, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి తుది రాత పరీక్షకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

వైభవంగా రథోత్సవం

సీతారామ చంద్ర స్వామికి ఎమ్మెల్యే మంచిరెడ్డి ప్రత్యేక పూజలు

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలోని బొగ్గులగట్టు సీతారామచంద్ర స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ రామనవమిని సంరద్భంగా సీతారామ చంద్ర స్వామి ఆలయంలో వారం రోజుల పాటు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లవెల్లి, తమ్మలోనిగూడ, మాల్, కిషన్‌పల్లి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు వారం రోజుల్లో సాముహిక వత్రాలు చేశారు. ఈ వ్రతాలతో కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మిక. వారం రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. ఈ రథోత్సవంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు రూ.12.50లక్షల కానుకలు, బంగారు నగలను సమర్పించారు.

ఆలయాభివృద్ధికి రూ.20లక్షల నిధులు: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రథోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి విడతల వారీగా రూ.20లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ గండికోట యాదయ్య, సర్పంచ్ రాజు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, మోహన్, జిల్లా శోభ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యత' నిధులతో తండాల అభివృద్ధి

ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి



పాతకోట తండా గిరిజనులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: ఐక్యత ఫౌండేషన్ నిధులతో గిరిజన తండాలను అభివృద్ధి చేస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పాతకోట తండాలో పర్యటించారు. వారి వృత్తి ఆదాయ వనరులను గమనించారు. తండావాసుల కోరిక మేరకు హనుమాన్ ఆలయం గ్రిల్స్, బండలు, పెయింటింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. తండాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఫౌండేషన్ సహకారంతో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్(పీకేటీ) పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, ఉప సర్పంచ్ గురుసింగ్, వార్డు సభ్యులు దేశ్యానాయక్, వాచ్యానాయక్, శ్రీను, జీర్యానాయక్, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మైసమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్సీ తదితరులు

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కడ్తాల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి మైసిగండి మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ప్రమోషన్, బదిలీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని, జీఓ 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కాశీరావు, రమేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే మార్పు సాధ్యం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



నూతన కమిటీ సభ్యులతో మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మార్పు సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లోయపల్లి గ్రామానికి చెందిన మిద్దె నవీన్ గౌడ్‌కు యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. నియంతృత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్మా నరేంధర్‌రెడ్డి,పీఏసీయస్ డైరెక్టర్లు హన్మంత్‌రెడ్డి, వేణుగోపాల్ రావు,నాయకులు విక్రమ్ గౌడ్, పోచయ్య, ఏర్పుల రాజు,సురేష్, రాంచంద్రయ్య, కారింగ్ జంగయ్య, రామదాస్, మారయ్య,జానయ్య, కృష్ణ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల కుట్రలను తిప్పికొడదాం

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బలహీన పరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టి వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధిద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మాడ్గుల మండల కేంద్రంలో వాసవి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని.. రాష్ట్రంలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అంతున్నాయని ఆయన వివరించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని.. కుట్రలో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. విపక్షాల కుట్రలను తిప్పికొట్టి బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పగడాల రవి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు అంబాల జంగయ్యగౌడ్, యాదిరెడ్డి, రమేశ్‌రెడ్డి, వసురాంనాయక్, పార్వతమ్మ, రూప, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సుభాశ్, ధర్మారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లాలయ్యగౌడ్, డాక్టర్ రాంరెడ్డి, రాములు, భూపతిరెడ్డి, విష్ణు, వరుణ్, అనిల్, చలమందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో భవిష్యత్



గణేశ్ నాయక్‌కు నియామకపత్రం అందజేస్తున్న అంజయ్యయాదవ్

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్

యాచారం: కష్టపడి పనిచేసే వారికి పార్టీలో భవిష్యత్ ఉంటుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ నుంచి వేధింపులు, ఇబ్బందులు ఉంటాయని వాటిని తట్టుకుంటూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా గణేశ్‌నాయక్‌ను నియమిస్తూ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు గోగికార్ రమేశ్, విజయకుమార్, నక్క శ్రీనివాస్ యాదవ్, పల్లపు నరేశ్, పత్తి రాజు, సంగెం శ్రీనాథ్, గంగల శేఖర్, గౌరిగే హరికృష్ణ, నేనావత్ జగదీశ్, మస్కురి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయండి



కాసాని జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కోరారు. నగరంలోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో శుక్రవారం కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ నియోజకవర్గ ఇంచార్జి యాదీలాల్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు కలిశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్‌ను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యం, మల్లయ్య, నర్సింహ, పద్మనాభం, సత్యం, వజ్రలింగం, ఆనంద్, భాస్కర్, వెంకటేశ్, గిరి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్, శ్రీనాథ్, కుమార్‌గౌడ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు మేలు



కడ్తాల్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి: చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు వరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన శుక్రవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ సాధనకు ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తోందన్నారు. అర్హులంతా పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జైపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తలకొండపల్లి: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతకోటతండాకు చెందిన పాత్లావత్ మల్లేశ్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.20వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, జీర్యానాయక్, గోపి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.62లక్షలు


మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదట దుకాణా సముదాయ నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డు ఆదాయం పెంపునకు, రైతులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నుంచి 8 దుకాణాల నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి పక్కన చెక్‌పోస్టు భవన నిర్మాణానికి రూ.7.5లక్షలు మంజూరయ్యాయని వివరించారు. తలకొండపల్లి క్రాస్‌రోడ్ వద్ద గల వ్యవసాయ మార్కెట్ గోదాం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

ముంపును అరికట్టేందుకు మూడో టర్నెల్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లోని లోతట్టు కాలనీలు ముంపునకు గురి కాకుండా ఉండేందుకు మూడో టర్నెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.వర్షాకాలంలో చెరువు నీరు ఓవర్ ఫ్లో కాకుండా నీటి మట్టాన్ని నియంత్రించేందుకు టర్నెల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల చేస్తున్నారని, ఇప్పుడు నిర్మించే మూడో టర్నెల్ వల్ల అవసరమైన సమయంలో నీటిని త్వరగా బయటకు పంపవచ్చని అన్నారు. మూడు, నాలుగు నెలలుగా పనులు నత్తనడకన నడుస్తున్నాయని, పనుల్లో వేగం పెంచి ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. అంచనాలను మించి ఖర్చు అవుతున్నందువల్ల కాంట్రాక్టర్‌కు అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్




అనిల్‌కు నియామకపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన స్వగ్రామం జూలపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జోకూరి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా అనిల్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశాడన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర, జిల్లా మండల నాయకులు భగ్‌వాన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అజీంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, మైనార్టీ అధ్యక్షుడు ఆరీఫ్, చెన్నకేశవులు, వెంకటేశ్, వినోద్, శశిధర్‌రెడ్డి, షఫీ, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ



ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి కేకు తినిపిస్తున్న తల్లిదండ్రులు



అబ్దుల్లాపూర్‌మెట్: ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రాజేశ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: అట్టహాసంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన తల్లిదండ్రులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయం వద్ద కుంటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల, అభిమానుల కోలహలం మధ్య కేక్‌ను కట్ చేశారు. ప్రశాంత్‌రెడ్డికి పూలదండలు, తలపాగా, శాలువలు, పుష్పగుచ్ఛాలు, కరవాలం బహూకరించి శుభకాంక్షలు తెలిపారు. బంటి యూత్ ఫోర్స్, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానుల నడుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న స్థానికులు

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాసనాలు వేయాలని శ్రీ షిరిడీసాయి అష్టాంగ యోగా శిక్షణ వ్యవస్థాపకుడు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. షిరిడీ సాయి అష్టాంగ యోగ శిక్షణ కార్యక్రమాలు కర్మన్‌ఘాట్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్మన్‌ఘాట్ పరిసరాల్లోని కాలనీవాసులు ఈ యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ, ప్రస్తుతం కోవిడ్ వంటి భయాలు వెంటాడుతున్న తరుణంలో శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి ఈ యోగా శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం , సాయంత్రం నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని వ్యాయామాలు, సూర్యనమస్కారాలు, ఆసనాలు నేర్చుకోవాలని ఇస్మాయిల్ గురూజీ సూచించారు.